క్లుప్తంగా

మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్‌గా బలరాం



మిర్యాలగూడ : మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్‌గా బలరాం శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2020లో గ్రూప్ అధికారిగా ఉద్యోగం సాధించిన బలరాం అబ్దుల్లాపూర్‌మెట్, సూర్యాపేట, బీబీనగర్‌లలో పనిచేశారు. ఇటీవల బదిలీల్లో ఆయన మిర్యాలగూడకు బదిలీపై వచ్చారు.

కొండమల్లేపల్లి ఈఓగా డాకునాయక్



డాకునాయక్‌ను సన్మానిస్తున్న పంచాయతీ సిబ్బంది

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ ఈఓగా డాకునాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఓగా పని చేసిన వీరబాబు కనగల్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో పెద్దవూర నుంచి డాకునాయక్ బదిలీపై కొండమల్లేపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందితో పాటు పలువురు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు నారాయణ, సంత కాంట్రాక్టర్ దూదిమెట్ల శ్రీనివాస్‌యాదవ్, షేక్ ఫయాజ్, ప్రవీణ్, సతీష్, రాంరెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చింతపల్లి సీడీపీఓగా సక్కుబాయి



చింతపల్లి : చింతపల్లి మండల ఐసీడీఎస్ సీడీపీఓగా సక్కుబాయి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీడీపీఓగా పని చేస్తున్న లావణ్యకుమారి మునుగోడుకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌లో సీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న సక్కుబాయి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజశేఖర్



నాగార్జునసాగర్ : నందికొండ హిల్‌కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా దాసరి రాజశేఖర్ శనివారం విధుల్లో చేరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో చేపట్టిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ దార పాండయ్య సూర్యాపేట జిల్లా నెమ్మికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ బదిలీపై రాజశేఖర్ ఇక్కడకు వచ్చారు.

దాతల సాయం మరువలేనిది

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. శనివారం దామరచర్ల మండలం కల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దాత డాక్టర్ ధీరావత్ హరి రూ.10వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడా సామగ్రి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధీరావత్ శారదపాచ్యానాయక్, వాగ్యానాయక్, రమేష్, గురువారెడ్డి, సయ్యద్ బాషా, హెచ్ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలిగించొద్దు

మిర్యాలగూడ టౌన్ : రాత్రి 10.30గంటల వరకే వ్యాపారాలకు అనుమతి అనే నిబంధనతో ఇబ్బందులు కలిగించొద్దని శనివారం చిరు వ్యాపారులు ఆర్డీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ జమాల్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలతో ఒక వైపు చిరు వ్యాపారులు, మరో వైపు ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆ పత్రంలో పేర్కొన్నారు. రెండు గంటలు అదనంగా సమయం ఇవ్వాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఏఐఎంఐఎం నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫారూఖ్, మాలమహానాడు విద్యార్థి విభాగం జాతీయ కార్యదర్శి సురేష్, బీఎంపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంజయ్య, ముబిన్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

దేవరకొండ : లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు సైతం క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ సముద్రాల ప్రభాకర్, నిరంజన్, భిక్షమయ్య, భద్రయ్య, చంద్రకళ, రాజేష్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' పక్కాగా చేపట్టాలి

హాలియా : హాలియా పట్టణంలో చేపట్టనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పక్కగామున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ కోరారు. శనివారం హాలియా మున్సిపాలిటీలో మున్సిపల్ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ×స్వచ్ఛదనం-పచ్చదనం×లో భాగంగా పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వ్యాపారస్తులు 10లోగా క్లీయర్ చేసుకోవాలని లేని పక్షంలో ఈనెల 11న షాపుల్లో సోదాలు నిర్వహిస్తామన్నారు. సోదాల్లో వ్యాపారస్తుల వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు లభ్యమయితే వ్యాపారస్తులకు రూ.10వేల వరకు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో ఈ నెల 5నుంచి ప్రారంభం కానున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పట్టణంలో పచ్చదనం పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.

'స్వచ్ఛదనం- పచ్చదనం' విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ఈనెల 5నుంచి ప్రారంభమయ్యే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కమిషనర్ ఛాంబర్స్‌లో వార్డు ఆఫీసర్లు, శానిటేషన్ జవాన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఐదు రోజుల పాటు శానిటేషన్ పనులను ప్రత్యేకంగా చేపట్టాలన్నారు. ప్రధానంగా కాలువల్లో పూడికతీత పనులు, పిచ్చి మొక్కలను తొలగించాలని, వీధి కుక్కలపై ఎవరైనా దరఖాస్తు ఇస్తే వాటిని స్వీకరించాలని, ప్రతి వార్డులో ఐదు చొప్పున ఇంకుడు గుంతలు తీయించే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ ఇంజనీర్ శ్వేతారెడ్డి, ఆర్ఓ జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

మిర్యాలగూడ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ధీరావత్ తండాలోని అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు పంచాయతీ కార్యదర్శి కోల సాయికుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటడం, పారిశుద్ధ్యం, మురుగునీటిని తొలగించుట, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం, పిచ్చి మొక్కలను తొలగించడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

కొండమల్లేపల్లి : గ్రామాల్లో ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ రాంరెడ్డి కోరారు. శనివారం కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈనెల 5నుంచి 9వతేదీ వరకు మండలంలోని 26 గ్రామపంచాయతీల్లో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5న స్వచ్ఛదనం, పచ్చదనం, 6న తాగునీటి, వాన నీటి హార్వెస్టింగ్ అంశంపై, 7న డ్రెయినేజీ, మురుగు నీటి నిల్వ, గుంతలు పూడ్చడం, 8న ఆరోగ్య విషయాలు, వీధి కుక్కల అంశాలపై, 9న పబ్లిక్ ఇన్స్టిట్యూషన్స్, పబ్లిక్ స్థలాల పరిశుభ్రత అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ డాకునాయక్, ఏపీఎం బొడ్డుపల్లి శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ, అంగన్‌వాడీ టీచర్లు ఆశ వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది కోట్ల సతీష్, ప్రవీణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంరెడ్డి



మిర్యాలగూడ : గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్లాస్టిక్ రహిత మిర్యాలగూడ పట్టణంగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలు సంఘాలు, వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ప్రీతంరాజు, కరుణాకర్, శ్రీనివాస్, సుధాకర్, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్

మిర్యాలగూడ : ఎన్నికల్లో రాష్ట్రంలోని నిరుద్యోగులకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎండి.షోయబ్ అన్నారు. శనివారం జాబ్ క్యాలెండర్‌తో నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసి దానం నాగేందర్ దిష్టిబొమ్మను పట్టణంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని మోసపూరిత హామీలను ఇచ్చి అధికారం చేపట్టారని, ఇప్పుడు జాబ్ క్యాలెండర్‌లో అరకొర పోస్టులతో నోటిఫికేషన్లు విడుదల చేస్తామంటున్నారని ఆరోపించారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేసిన దానం నాగేందర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని లేకుంటే ఆయనను రాష్ట్రంలో తిరగనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అంజియాదవ్, దస్రు నాయక్, కిరణ్, మల్లేష్, మహేష్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి, దానం నాగేందర్ దిష్టి బొమ్మను ఊరేగిస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

నందికొండలో ఆగని ఆక్రమణలు

- గుట్టలు తవ్వి చదును చేస్తున్న ఆక్రమణదారులు
- చర్యలు తీసుకుంటామన్న ఇరిగేషన్ మంత్రి, ఎమ్మెల్యే

నాగార్జునసాగర్ : నందికొండలో ఆక్రమణలు ఆగడం లేదు. గుట్టలను చదును చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించుకుంటున్నారు అక్రమార్కులు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయగానే ఎవరైనా స్థలాలు ఆక్రమిస్తే సహించబోమని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఆక్రమణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేసి జలాశయ తీరంలో చేసిన నిర్మాణాలను కూలగొట్టారు. చాలా కాలం వరకు ఎన్నెస్పీ స్థలాలను ఆక్రమించాలంటే ఆక్రమణదారులు బయపడ్డారు. కానీ ప్రస్తుతం కొంతమంది రియల్ ఎస్టేట్ చేసే బ్రోకర్లు సందు, గొందుల్లో వేరేవారితో ఆక్రమింపజేసి విక్రయించుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ప్రధాన రహదారి వెంట కొండలు తవ్వి భూమిని చదును చేసి ఆక్రమించుకుంటున్నారు. ఎస్ఈ కార్యాలయం వెంట భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేసేందుకు రాళ్లు, ఇటుకలను అక్కడకు చేర్చగా ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టారు. పైలాన్‌లో ప్రధాన రహదారి వెంట చాలా భూములు ఆక్రమించి గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిర్మాణాలు చేసి ఇతరులకు విక్రయించిన సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరచి వాటిని స్వాధీనం చేసుకోసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పైలాన్‌లో గుట్టను తవ్వి జేసీబీతో చదును చేస్తున్న ఆక్రమణదారులు

ఆక్రమణదారులు ఎంతటివారైన వదిలిపెట్టం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఎన్నెస్పీ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తే ఎంతటివారినైన వదిలిపెట్టబోమని రాష్ట్ర సాగునీటిశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం డమకాల్వకు నీటిని విడుదల చేసేందుకు సాగర్‌కు వచ్చిన ఆయన విజయవిహార్‌లో విలేకరుల పమావేశం నిర్వహించారు. విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆక్రమణదారులను వదిపెట్టబోమని నిర్మాణాలను కూలగొట్టి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

స్కేటింగ్ పోటీల్లో విద్యార్థికి కాంస్య పతకం

మిర్యాలగూడ అర్బన్ : హైదరాబాద్‌లోని బాచుపల్లిలో నిర్వహించిన ఐదో ఇంటర్ స్కూల్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ 2024 పోటీల్లో మిర్యాలగూడ విద్యార్థి బట్టు శతమన్యు కాంస్య పతకం సాధించాడు. పట్టణానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్టు వైద్యురాలు రమాదేవి, న్యాయవాది వెకటేశ్వర్లు దంపతుల కుమారుడైన శతమన్యు స్థానిక విశ్వభారతి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. చిన్నతనం నుంచి స్కేటింగ్ విభాగంలో తల్లదండ్రులు శిక్షణ ఇప్పిస్తుండగా గతంలో పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో జిల్లా స్థాయి బహుమతులు సాధించాడు. 9ఏళ్లలోపు వయస్సు వారి విభాగంలో శతమన్యు ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించాడు. శతమన్యు పాఠశాల సీఈఓ రవికుమార్ అభినందించారు.



కాంస్య పతకం అందుకుంటున్న శతమన్యు

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని వినతి



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలగాని వెంకటేష్‌గౌడ్ అన్నారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందచేసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి బీసీలు కీలకపాత్ర పోషించారన్నారు. ఎన్నికల్లో ప్రకటించిన విధంగా రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టి 42శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లా వెంకటయ్య, నక్క నగేష్, జిల్లా వెంకటేశ్వర్లు, సైదులు, రామకృష్ణ, విష్ణు, శ్రీను, రాములు, నాగయ్య, వీరమల్ల సైదులు పాల్గొన్నారు.

శ్రీహర్షకు మండలి చైర్మన్ గుత్తా నివాళి

నిడమనూరు: మండల కేంద్రానికి చెందిన డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య కుమారుడు శ్రీ హర్ష(37) గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావులు శ్రీ హర్ష మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

మరో ఆరు రోజుల్లో నిశ్చితార్థం

మరో ఆరు రోజుల్లో వివాహ నిశ్చితార్థం ఉండగా శుక్రవారం విరిగినేని శ్రీహర్ష గుడెపోటుకు గురై మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో విషాధం నింపింది. నిశ్చితార్థం తర్వాత పెళ్లి అంగరంగా వైభవంగా చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈలోగా విషాధం నెలకొన్నది. నిడమనూరులో శనివారం నిర్వహించిన శ్రీహర్ష అంత్రక్రియల్లో పార్టీలకు అతీతంగా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : రోడ్డు మరమ్మతుల కారణంగా పట్టణంలోని సబ్‌జైల్ రోడ్డు, మేదర్‌బజార్, బీఎల్‌ఆర్ అపార్‌మెంట్ కాలనీల్లో ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మండలంలోని అవంతీపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనుల్లో భాగంగా యాద్గార్‌పల్లి ఇండస్ట్రీయల్ ఏరియాతోపాటు అవంతీపురం, ఆలగడప, సుబ్బారెడ్డిగూడం, జాలుబావితండా, రాయినిపాలెం, బదలాపురం, ముల్కలకాల్వ తదితర గ్రామల్లో సోమవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో అధికారులు తెలిపారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ పరిశ్రమల వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

హక్కులకు భంగం కలిగిస్తే ఉద్యమం తప్పదు

మిర్యాలగూడ : మాలల హక్కులకు భంగం కలిగిస్తే ఉద్యమం తప్పదని మాలమహానాడు జిల్లా నాయకుడు బైరం నర్సయ్య అన్నారు. శనివారం ఆయన దామరచర్ల మండల కేంద్రంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై వచ్చిన తీర్పుపై మాలలు న్యాయ పోరాటం చేస్తామన్నారు. దేశంలోని మాలలందరిని ఐక్యం చేసి హక్కుల కోసం ఈనెల 8, 9, 10 తేదీల్లో ఢిల్లీలో నిరసన వ్యక్తం చేస్తామని ఆయన తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేస్తే అనర్థాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పల్లా సుదర్శన్, బైరం భిక్షం, గురవయ్య, పల్లా సుదర్శన్, ప్రభాకర్, దయానంద్, శ్రీను, రాంప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

త్రిపురారం : గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్దదేవులపల్లిలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆ పార్టీ నాయకులతో కలిసి బుచ్చిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి సహకారం అందిస్తున్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ప్రతినిధులు, సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, మాజీ ఎంపీటీసీ అంబటి రాము, నరేందర్, నగేష్ యాదవ్, కోటేష్, నాయిని సంతోష్, సైదులు, వెంకటయ్య, కృష్ణ, సూరయ్య పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలం

త్రిపురారం : మండలంలోని బొర్రాయిపాలెం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూములు కౌలుకు ఇచ్చేందుకు సోమవారం వేలం వేయనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి నవీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ వేలంలో చుట్టుపక్కల గ్రామాల వారు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

పీహెచ్‌సీలో 24గంటలు వైద్య సేవలందించాలి

కొండమల్లేపల్లి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో 24గంటల పాటు వైద్య సేవలందించాలని కోరుతూ రజక సంఘం నాయకుడు భూతరాజు దాసు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం దేవరకొండకు వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడాన్ని హర్షిస్తూ శనివారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు రూపావత్ హరిప్రసాద్ మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్లలో ఏనాడూ జాబ్‌క్యాలెండర్ విడుదల చేయకుండా కాలయాపన చేసి నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి మాట నిలబెట్టుకున్నాడన్నారు. నిరుద్యోగులకు భరోసా ఇచ్చేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. గ్రూప్-2 పరీక్షా వాయిదాపై గత ప్రభుత్వం మాదిరిగా పంతాలకు పోకుండా నిరుద్యోగులు కోరుకున్న విధంగానే ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కొడటి అనిల్, అమర్ చౌదరి, రాజునాయక్, ఎన్ఎస్‌యూఐ నాయకులు శివ, పవన్, నాగరాజు, సతీష్, రమేష్ ఉన్నారు.

ఎన్ఆర్‌ఐలతో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమావేశం

పెద్దవూర : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి అమెరికా పర్యటనలో ఉన్న సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిని నియోజకవర్గానికి చెందిన ఎన్ఆర్‌ఐలను శనివారం కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాగర్ నియోజకవర్గానికి చెందిన ఎన్ఆర్‌ఐలు నియోజకవర్గంలో మెడికల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వివిధ పరిశ్రమల అధిపతులతో కలిపించి మాట్లాడించారు. త్వరలో రూ.100 కోట్లతో నియోజకవర్గంలో మెడికల్ పరిశ్రమను నెలకొల్పేందుకు ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీనిలో భాగంగా అమెరికా వైద్య విధానానికి సంబంధించిన పరిశ్రమలు, పరికరాలను సీఎంతో పాటు పరిశీలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ఆర్‌ఐలు శ్రీనివాస్ నాగనబోయిన, గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి, గ్లోబల్ తెలంగాణ సంఘం అధ్యక్షుడు నందిగామ వెంకట్‌రెడ్డి, మధు కన్నంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమెరికాలో ఎన్ఆర్‌ఐలతో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యం పదిలం

మిర్యాలగూడ టౌన్ : తల్లి పాలల్లో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలాకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని హనుమాన్‌పేట అంగన్‌వాడీ కేంద్రం-2లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె.సుజాత, హెల్పర్ నవ్య, ఏఎన్ఎం మంజులత, ఆశ వర్కర్లు ఉన్నారు. పట్టణంలోని పాపాసులదిబ్బ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ప్రకాశ్ నగర్ పీహెచ్‌సీ డాక్టర్ నిపున్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, ఉమారాణి, ధనలక్ష్మి, రజియా, తదితరులున్నారు. 17వ వార్డు విద్యానగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్ వైజర్ నజిమాబేగం, ఏఎన్ఎం భాగ్యమ్మలు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలను పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. మండలంలోని రాజవరం సెక్టారు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు లీలావతి, నాగమణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఏసీడీపీఓ సువర్ణ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పైలాన్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకాయమ్మ,అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్ప, పర్వీన్, సైదమ్మ, నయీమ్, సరళ, ఆదిలక్ష్మీ, నిర్మలదేవి తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లీలాకుమారి

అడవిదేవులపల్లి : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లిపాలతో కలిగే లాభాలు, డబ్బా పాలతో జరిగే నష్టాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నారాయణమ్మ, శోభ, రమ, మణెమ్మ పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించాలి

హాలియా : పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించాలని, బిడ్డకు తల్లిపాలు అమృతం వంటివని సీడీపీఓ ఉదయశ్రీ అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అనుముల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం అనుముల మండలం మారేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శిరీంఫెరోజు, ఆయా అనూష, పౌజీయా, తదితరులు ఉన్నారు.

వేములపల్లి : తల్లి పాలతో బిడ్డ ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తిమ్మారెడ్డిగూడెం, సల్కునూరు తదితర గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శోభ, జ్యోతి, సంజీత, ఆశాలు సంధ్య, అమీనా, రాణి, సరిత, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి : తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, గ్రామస్తులు

చింతపల్లి : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీఓ సక్కుబాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అంజలి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై సూపర్‌వైజర్ మల్లీశ్వరి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ ఏలేశ్వరి, అంగన్ వాడీ టీచర్లు సరిత, మంగమ్మ, పర్వీన్, శైలజ, అశా కార్యకర్తలు పద్మ పాల్గొన్నారు.

శిశువుకు తల్లిపాలు శ్రేయస్కరం

కొండమల్లేపల్లి : అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్ ఎం.భారతమ్మ అన్నారు. శనివారం మండలలలోని చింతకుంట్ల గ్రామంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే తాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఏపీఎం రామచంద్రనాయక్, టీపీ యాదయ్య, ఏఎన్ఎం ధనలక్ష్మి, ఆశర్కర్లు పాల్గొన్నారు.